కాంగ్రెస్ పార్టీని నమ్మితే మళ్లీ కరెంట్ కష్టాలే..

దంతాలపల్లి: కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటు వేస్తే మళ్లీ కరెంటు కష్టాలు మొదలైతయ్.. గతంలో పంటలను కాపాడుకునేందుకు రాత్రి, పగలు చలిలో మోటర్ల దగ్గర పడుకొని నీరందిస్తే సగం తడిసేది. సగం ఎండేది. అలాంటి రోజులు మాకొద్దు. మళ్లా బాధలు మాకొద్దు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కేసీఆర్ 24గంటల కరెంట్ ఉచితంగా రైతులకు ఇస్తున్నడు. కాంగ్రెస్ వస్తే మూడు గంటల కరెంట్ ఇస్తా అంటున్నరు. అలాంటి వారికి ఓటెయ్యం. ఈ ప్రభుత్వం వచ్చినాక రైతులందరూ రెండు పంటలు పడిస్తూ సంతోషంగా ఉన్నరు. ఎప్పుడు అవసరం ఉంటే మోటర్ వద్దకు వెళ్లి చాలు చేసి నీళ్లు పెట్టుకుంటున్నాం. ఇంతకన్న మాకు ఏం అవసరం లేదు. మళ్లీ కేసీఆర్ సీఎం కావాలి.

–రాచకొండ రామ్మూర్తి, రైతు, కుమ్మరికుంట్ల

రైతుల కష్టాలు ఇప్పుడిప్పుడే తొలగిపోతున్నయ్..

చిన్నగూడూరు : తెలంగాణ వచ్చినంక కేసీఆర్ పాలనలో రైతుల కష్టాలు ఇప్పుడిప్పుడే తొలగిపోతున్నయ్.. కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంటు సాలు అంటాండు. ఇట్లా రైతులను ఆగంజేసే కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి మోసపోవద్దు. ఊర్లల్ల చిన్న, సన్నకారు రైతులమే ఎక్కువ ఉన్నం. 10 హెచ్‌పీ మోటర్లు ఎట్ల తెచ్చుకోం. పెద్ద మోటరుకు, సైపోనుకు కలిపి లక్షల్లో ఖర్చు అయితది. రైతులంటే ఎందుకంత చులకనగా చూస్తాండ్రు. కరెంటు కోసం ఎదురు చూసే రోజుల నుంచి ఉచితంగా 24 గంటల కరెంటు యిచ్చే రోజులు తెచ్చిన కేసీఆర్‌ను ఎట్ల మరిచిపోతాం. రైతు కష్టాలు తెలిసి మా కోసం పనిజేస్తున్న కేసీఆర్ ప్రభుత్వానికే మా మద్దతు ఉంటది.

–బొమ్మ లింగమూర్తి, రైతు, విస్సంపల్లి

ఎన్నికలకు సర్వం సిద్ధం

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- డోర్నకల్ నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- మొత్తం 2,19,264 ఓటర్లు
- పురుషులు 1,08,210 మంది, మహిళ ఓటర్లు 1,01,146..
- పోలింగ్ సెంటర్లకు చేరుకున్న సిబ్బంది
- ఎన్నికల విధుల్లో 2500 అధికారులు
- బరిలో 14 మంది అభ్యర్థులు

డోర్నకల్: ఎన్నికల సామగ్రితో అధికారులు

నర్సింహులపేట: పోలింగ్ కేంద్రానికి సామగ్రితో చేరుకున్న సిబ్బంది

నర్సింహులపేట/ మరిపెడ, నవంబర్ 29: అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 30 పోలింగ్ ఉండడంతో అందుకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నరసింహ రావు తెలిపారు. డోర్నకల్ నియోజకవర్గ వ్యాప్తంగా 164 గ్రామాలకు గాను 256 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గురువారం జరిగే ఎన్నికల సందర్భంగా ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,19, 264 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 1,08,210 మంది పురుషులు, 1, 01,146 మంది మహిళా ఓటర్లు, 8 మంది ఇతరులు ఉన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. తనిఖీల్లో రూ.47,08,95,181 సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు లేకుండా విద్యుత్, ఫ్యాన్లతోపాటు సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేందుకు 2500 మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎన్నికల బరిలో 14మంది అభ్యర్థులు ఉన్నారని, 37 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఎలాంటి ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

డోర్నకల్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. డోర్నకల్ పట్టణం, గ్రామాల్లో మొత్తం 41 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల సిబ్బందికి కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు.

చిన్నగూడూరు: మండలంలో 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ మహబూబ్ అలీ తెలిపారు. అన్ని కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

దంతాలపల్లి: మండలంలో 16 గ్రామ పంచాయతీలుండగా 29 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 23,772 మంది ఓటర్లు ఓటును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు సామాగ్రితో చేరుకున్నారు.

దంతాలపల్లి: ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

కురవి: పోలింగ్ బూత్‌లకు వీవీప్యాట్, ఈవీఎంలతో వెళ్తున్న సిబ్బంది

నాలుగు ఆదర్శ పోలింగ్ కేంద్రాలు

అందంగా అలంకరించిన డీఆర్‌డీఏ, ఐకేపీ సిబ్బంది

కురవి, నవంబర్ 29: నేడు జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని 56 పోలింగ్ బూత్‌లకు ఆరు రూట్లకు ఆరు సెక్టార్‌లుగా విభజించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు నలుగురు సిబ్బందిగా పీవో, ఏపీవో, ఓపీవోలు విధులు నిర్వర్తిస్తారు. క్రిటికట్ పోలింగ్ స్టేషన్లలో మైక్రో అబ్జర్వర్‌లు, వెబ్ కాస్టింగ్‌కు ప్రత్యేక సిబ్బంది పనిచేయనున్నారు. ఎన్నికల నియామవళి ప్రకారం వికలాంగులు, 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు తొలిసారిగా హోంఓటింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. అంతే కాకుండా ఉమ్మడి కురవి మండలంలోని కురవి, అయ్యగారిపల్లి, కాంపల్లి, సీరోలులో ఒక్కో పోలిం గ్ బూత్‌ను ఆదర్శ కేంద్రంగా తీర్చిదిద్దారు. ఆయా సెంటర్లలో ఐకేపీ సిబ్బంది అందంగా తీర్చిదిద్దారు. సీరోలులో ఏర్పాటుచేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రం మహిళల కోసం, అయ్యగారిపల్లి, కాంపల్లిలో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ బూత్‌లను పురుషుల కోసం ఏర్పాటు చేశారు. ఐకేపీ సిబ్బంది, సీఏలు పూలతో అందంగా అలంకరించడమే కాకుండా మామిడి తోరణాలతో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చారు. కేంద్రాలకు వెళ్లే ప్రదేశంలో కార్పెట్, ప్రత్యేక మరుగుదొడ్లు, తాగునీటి వసతి, ప్రత్యేక విశ్రాంతి ప్రదేశం ఏర్పాటు చేస్తున్నారు. ఇకపోతే ఏడు గంటలకు ఆరంభమయ్యే ఎన్నికల పోలింగ్‌కు ముందుగా వచ్చే 100మందికి పైగా ఓటర్లను డప్పు చప్పుళ్లు, పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలకనున్నట్లు తెలుస్తోంది. వికలాంగుల కోసం వీల్‌చైర్‌లు ఏర్పాటు చేసి, ర్యాంప్‌లు నిర్మించారు.

డోర్నకల్‌లో మోడల్ పోలింగ్ కేంద్రాలు

డోర్నకల్: మున్సిపాలిటీ పరిధిలో రెండు మోడల్ పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ ఏర్పాటు చేశారు. జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆదర్శ మహిళా పోలింగ్ కేంద్రం, ఎంపీపీఎస్ పాఠశాలలో యువ ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలు, యువత పోలింగ్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డోర్నకల్: మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రం

డోర్నకల్: ఏర్పాటు చేసిన యువ ఆదర్శ పోలింగ్ కేంద్రం

వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుధాకర్‌రావు దంపతుల పూజలు



సుధాకర్‌రావు- విజయలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న నాయకులు

నర్సింహులపేట, నవంబర్ 29: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నెమురుకొమ్ముల సుధాకర్‌రావు- విజయలక్ష్మి దంపతులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి మొక్కు తీర్చుకునేందుకు వచ్చారన్నారు. ఆలయ ప్రాగణంలో సుధాకర్‌రావు దంపతులకు దేవస్థాన చైర్మన్ రమేశ్, బండ భిక్షం రెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, నెలకుర్తి సత్తిరెడ్డి, పుప్పాల రవీందర్, యాకన్న, రవీందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, లింగారెడ్డి, అశోక్‌రెడ్డి శాలువాతో సన్మానించారు.

వాహనాల తనిఖీలు

డోర్నకల్, నవంబర్ 29: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో డోర్నకల్ ఎస్సీ బీసీ కాలనీ, ముల్కలపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద బుధవారం ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్ని, ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. వాహనాల నంబర్లను, వాహనదారుడి వివరాలు రికార్డులో నమోదు చేస్తున్నారు.